మేం చెప్పిందే రేటు

- ఆర్టీసీ బస్టాండ్‌లలో దుకాణదారుల ఇష్టారాజ్యం
- ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు వస్తువుల విక్రయం
- ప్రయాణికుల జేబులకు చిల్లు



ఆర్టీసీ బస్టాండ్‌లోని కూల్‌డ్రింక్ స్టాల్

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్ల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. చిన్నారులతో బంధువుల ఊర్లకు వెళ్లే వారు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లలో ఏదైనా వస్తువుల కొనుగోలు చేయాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. దుకాణదారులు ఎమ్మార్పీని మించి అధిక ధరలకు విక్రయిస్తుండడంతో ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో 45, ఆత్మకూరు బస్టాండ్‌లో 30 దుకాణాలు ఉన్నాయి. కొందరు దుకాణదారులు ఎమ్మార్పీ నిబంధనలను ఉల్లంఘించి అధిక ధరలకు వస్తువులను విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీ కన్నా అధికంగా రూ.5 నుంచి రూ.10 వరకు వసూలు చేస్తున్నారు. బస్టాండ్ బయటకెళ్లి తెచ్చుకుంటే లగేజీ భద్రత, బస్సు వెళ్లిపోతుందనే భయంతో తప్పని పరిస్థితుల్లో ప్రయాణికులు బస్టాండ్‌లలోనే తినుబండారాలు, శీతలపానియాలను కొనుగోలు చేస్తున్నారు.

ప్రదర్శనకే ధరల పట్టికలు

దుకాణాల బయట వస్తువులు, ఆహార పదార్థాలు, శీతలపానియాల ధరల పట్టికతో కూడిన బోర్డులను విధిగా ప్రదర్శించాలి. అయితే దుకాణదారులు తూనికలు, కొలతలు శాఖ అధికారుల నిబంధనలను బేఖాతర్ చేస్తూ వినియోగదారులకు కనిపించకుండా బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. కొందరు కనిపించేలా ఏర్పాటు చేసిన దాంతో సంబంధం లేదన్నట్లుగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రయాణికులు ప్రశ్నిస్తే ఇష్టమైతే కొనండి..లేకపోతే పోండి అన్నట్లుగా సమాధానమిస్తున్నారు. దీంతో దుకాణాల నిర్వాహకులు ఎంత చెబితే అంత ధర చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇష్టమొచ్చిన ధరలకు విక్రయాలు

బస్టాండ్‌లలోని స్టాల్స్ నిర్వాహకులు ఆహార, శీతల పానియాలను తమకు ఇష్టమొచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు. వేసవి తాపానికి గొంతు తడుపుకొందామన్నా ప్రయాణికుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. రూ.2 వాటర్‌ప్యాకెట్‌ను రూ.4కు, రూ.20 కూల్‌డ్రింక్స్‌ను రూ.25, రూ.20 బిస్కెట్‌ప్యాకెట్‌ను రూ.25, రూ.20 లేస్‌ప్యాకెట్‌ను రూ.25కు అమ్ముతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో దుకాణదారులు ప్రయాణికులను దోచుకుంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు తినుబండరాలు, శీతలపానియాలు విక్రయించకూడదు. స్టాల్స్‌లో అధిక ధరలకు విక్రయించకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. ప్రయాణికులు ఫిర్యాదులు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. స్టాల్స్‌ను తనిఖీ చేసి చర్యలు తీసుకుంటాం.

– పీవీ శేషయ్య, ఆర్టీసీ ఆర్‌ఎం

క్లుప్తంగా

కోలా ఆనంద్‌కు సన్మానం



నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ జిల్లా ఇన్‌చార్జిగా ఎన్నికైన కోలా ఆనంద్‌ను పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు. కావలిలో సోమవారం జరిగిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన కోలాను ఆ పార్టీ జిల్లా లీగల్ సెల్ స్టేట్ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్, రవి, బీజేపీ జిల్లా కార్యదర్శి కాయల మధు, తదితరులు సన్మానించారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయ హుండీ కానుకలను మంగళవారం లెక్కించనున్నట్లు ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి దేవదాయ శాఖ, బ్యాంకు అధికారుల ఆధ్వర్యంలో హుండీ కానుకలను లెక్కిస్తారని వివరించారు.

వీరాంజనేయునికి శాకంబరి అలంకారం



శాకంబరి అలంకారంలో స్వామి

ముత్తుకూరు : హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా ముత్తుకూరులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం స్వామి శాకంబరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీప కాంతులతో అలంకరించిన ఆలయంలో వేదపండితులు స్వామిని వివిధ కూరగాయలు, తినుబండారాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. పంచేటి చంద్రమోహన్‌కుమార్, పంచేటి హేమంత్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

డ్రోన్ పిచికారీపై అవగాహన



సూచనలు చేస్తున్న ఏరో స్పేస్ ప్రతినిధి

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్రోన్ పిచికారీపై సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. గరుడా ఏరో స్పేస్ ప్రతినిధులు, కిసాన్ డ్రోన్ డిస్ట్రిబ్యూటర్ శ్రీనివాసరెడ్డి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటే రైతులకు ఖర్చులతో పాటు సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కె.శివనాయక్, ఏఓ ఎ.వాసు, ఉపసర్పంచ్ పామూరు లచ్చారెడ్డి, చుట్టుపక్కల ఆర్బీకేలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యవసాయాధారిత జీవనోపాధిపై సమావేశం

ముత్తుకూరు : అదానీ ఫౌండేషన్ ప్రతినిధులు పేదలకు వ్యవసాయ ఆధారిత జీవనోపాధి కల్పించాలని నిర్ణయించారు. అందులో భాగంగా నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లలిత శివజ్యోతితో ఫౌండేషన్ సీఎస్సార్ హెడ్ రాజేష్ రంజన్ సోమవారం సమావేశమయ్యారు. కృష్ణపట్నం, నారికేళపల్లి, ఈపూరు వెంకనపాళెం, ముత్తుకూరు పంచాయతీలకు చెందిన పేద మహిళల ఆర్థికాభివృద్ధి చేపట్టాల్సిన కార్యక్రమాలు చర్చించారు. హోమ్‌సైన్సు సైంటిస్ట్ డాక్టర్ సుజాత, సస్టైనబుల్ లవ్లీహుడ్ డెవలప్‌మెంట్ సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ రమేష్‌బాబు సమావేశంలో పాల్గొన్నారు. జీవనోపాధికి ఎంపిక చేసిన కార్యక్రమాలను జూన్ నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు.

మొలక పోలేరమ్మకు పంచామృతాభిషేకం

ఇందుకూరుపేట : మండలంలోని కొమరిక గ్రామంలో కొలువైన మొలక పోలేరమ్మకు జాతర నేపథ్యంలో సోమవారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అలాగే హోమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ప్రధాన ఘట్టమైన జాతర మంగళవారం జరుగనుంది. ఈ మేరకు కార్యక్రమ నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. జాతర సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఏపీజే అబ్దుల్‌కలాం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన వేదికలో కమిషనర్ పాల్గొన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. నగర ప్రజల నుంచి వివిధ సమస్యలపై 13 ఫిర్యాదులు అందగా, కమిషనర్ సంబంధిత విభాగాధికారులకు తెలియజేసి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం స్పందన అర్జీలను స్వీకరించారు. నగర ప్రజల నుంచి 36 అర్జీలు అందగా, వాటిని పరిశీలించి నిర్దిష్ట గడువులోగా ఆయా సమస్యలను పరిష్కరించి ఫిర్యాదుదారుల ఫోన్‌కు సందేశాలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ అధికారులతో మాట్లాడారు. జగనన్నకు చెబుదాం, స్పందన, ఏపీ సేవా పోర్టల్‌ను అన్ని విభాగాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ పరిశీలించి ఫిర్యాదులు పెండింగ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వార్డు సచివాలయాల స్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను సంబంధిత కార్యదర్శులు పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన అర్జీలను తగ్గించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకంపై ప్రజల్లో అవగాహన పెంచుతామన్నారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, అమ్మకాలు, కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని, ప్రత్యేక బృందాలతో దాడులు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలి



వీఆర్సీసెంటర్ వద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారత మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ,అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని వీఆర్సీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిరాజ్, ముస్లిం ఫెడరేషన్ రాష్ట్రాధ్యక్షుడు జియా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలోని మహిళా క్రీడాకారులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన ఎంపీపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా నిరసన చేపడుతున్న మహిళా రెజ్లర్లకు తమ మద్దతు ఉంటుందన్నారు. ఏఐవైఎఫ్, ఇన్సాఫ్, ఎస్‌డీపీఐ, ఆమ్‌ఆద్మీ నాయకులు అజీజ్, అహ్మద్, మున్నా, షబ్బీర్, ఉస్మాన్, ఉమర్, హాఫీజ్, కరిముల్లా, సుల్తాన్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు బీపీపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ గీతాలక్ష్మి

నెల్లూరు (అర్బన్): గర్భందాల్చినప్పుడు కనిపించే బీపీ ప్రమాదకరమని, అందువల్ల గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రసూతి విభాగాధిపతి గీతాలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ ప్రీఎక్లాంప్సియా (ఫిట్స్) దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలోని గర్భిణులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గీతాలక్ష్మి మాట్లాడుతూ బీపీ 140/90 కన్నా ఎక్కువ ఉంటే ప్రమాదకరమన్నారు. మొదటిసారి కాన్పు జరిగేటప్పుడు, పెద్ద వయస్సు లేదా అతిచిన్న వయస్సులో గర్భం దాల్చినప్పుడు బీపీ వల్ల ఫిట్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. బీపీ, షుగర్ ఉంటే కిడ్నీ వంటి అవయవాలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. గర్భిణుల్లో 23 శాతం మరణాలకు దారి తీస్తుందన్నారు. అలాగే డెలివరీ అయిన ఆరువారాల తర్వాత మూత్రంలో ప్రోటీన్ పోయినా, రక్తపోటు (బీపీ) ఉన్నా ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. వాంతులు, వికారం, కుడివైపు లివర్‌లో నొప్పి, యూరిన్ సరిగా రాకపోవడం, తదితర లక్షణాలు ఉంటే తక్షణమే గైనకాలజిస్టును కలిసి బీపీ చెక్ చేయించుకోవాలని సూచించారు.

టౌన్‌ప్లానింగ్ అవినీతిపై చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నూనె మల్లికార్జునయాదవ్

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతితో నగరంలోని రోడ్లు మూసుకుపోతున్నాయని కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జునయాదవ్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ వికాస్‌మర్మత్‌ను ఆయన కలిశారు. టౌన్‌ప్లానింగ్‌లోని అవినీతిని పరిశీలించి కట్టడికి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 24న జరిగిన కౌన్సిల్ సమావేశంలో టౌన్‌ప్లానింగ్ అవినీతిపై పరిశీలన జరపమని కమిషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ విషయంపై చర్యలు తీసుకున్నారా..లేదా అని కమిషనర్‌ను అడిగి తెలుసుకుందామని మళ్లీ స్పందనలో మరోసారి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు అవినీతి,అక్రమాలకు పాల్పడుతూ ఇష్టం వచ్చినట్లు అనుమతులు ఇస్తుండడంతో నూతనంగా భవనాలు నిర్మిస్తున్న వారు రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. దీంతో విశాలంగా ఉండాల్సిన రోడ్లు మూసుకుపోయి వాహనాల రాకపోకలు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. ఎంపీ ఆదాలప్రభాకర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అవినీతి అక్రమాలు లేని కార్పొరేషన్ కోసం పరితపిస్తున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరుతున్నామన్నారు.

మర్యాదపూర్వకంగా..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి తనకు పదవీ బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

–నెల్లూరు(దర్గామిట్ట)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఎస్సార్ ఆస్పత్రి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ జెడ్పీ కాలనీ విద్యుత్‌ఫీడర్ పరిధిలో నూతనంగా విద్యుత్ టవర్స్ ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని నేతాజీనగర్, పొదలకూరురోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ



నెల్లూరు(క్రైమ్): ఎంఎస్‌ఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండ్ వద్ద సోమవారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి నాయకుడు సాయిబాబు మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ఎంఎస్‌ఆర్ సేవాసమితి వ్యవస్థాపకుడు మాగుంట శరత్‌చంద్రారెడ్డి ఆదేశాల మేరకు ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుతో పాటు మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సేవా సమితి నాయకులు నిషాద్, వంశీ, సుకుమార్, అబ్దుల్, పూజిత్, నాని, తదితరులు పాల్గొన్నారు.

ఐరావతంపై అయోధ్య రామయ్య



ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెంలో జరుగుతున్న శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఐరావత వాహనంపై అయోధ్య రామయ్యకు భక్తులు గ్రామోత్సవం నిర్వహించారు. విశేష పుష్పాలంకరణతో పుర వీధుల్లో ఊరేగిన స్వామికి భక్తులు ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించండి



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ కూర్మనాథ్

- జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): 'స్పందన' అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మతో కలిసి 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అందజేసిన వినతిపత్రాలను జేసీ స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'స్పందన' కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంబంధించి ప్రజా సమస్యలపై అవసరమైతే తనిఖీ చేసి పరిష్కారమార్గం చూపాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ, మెప్మా, హౌసింగ్, ఐసీడీఎస్ పీడీలు కె.సాంబశివారెడ్డి, రవీంద్ర, వెంకటదాస్, సౌజన్య, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీపీఓ సుస్మిత, డీఈఓ గంగాభవాని, సర్వే రికార్డుల ఏడీ హనుమాన్ ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు పాల్గొన్నారు.

- క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను అరెస్ట్ చేయాలని మహిళా క్రీడాకారులకు మద్దతుగా ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్, కార్యదర్శులు అహ్మద్ తదితరులు జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు.
- దివ్యాంగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ బాబూయాదవ్‌తోపాటు పలువురు జేసీకి వినతిపత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో బాలరామాయణ సప్తాహం ప్రారంభం



శ్రీకృతికి నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఆలూరు శిరోమణిశర్మ

నెల్లూరు(బృందావనం): సంస్కృతి, సంప్రదాయాలతో భక్తితత్పరతను కలిగించే ఇతిహాసాలను బాల్యం నుంచి ప్రతిఒక్కరూ తెలుసుకుని ఉత్తమపౌరులుగా ఎదగాలని బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణిశర్మ పేర్కొన్నారు. శెట్టిగుంటరోడ్డు, వీవర్స్‌కాలనీలోని శ్రీపట్టాభిరామ స్వామి దేవస్థానంలో బాలరామాయణ, నామరామాయణ సప్తాహం కార్యక్రమం ఆలూరు శిరోమణిశర్మచే ఆదివారం రాత్రి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలరామాయణం, నామరామాయణాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు రామాయణం, భారతం, భాగవతం, తదితర పురాణాలను, ఇతిహాసాలను వివరించి భారతీయ సనాతన ధర్మాన్ని కాపాడేందుకు కార్యోన్ముఖులను చేయాలన్నారు. వారం రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 8గంటల వరకు సప్తాహం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి పాల్గొనాలన్నారు. అనంతరం బాలరామాయణం, నామరామాయణం ప్రతులను బాలలకు అందజేశారు. భక్తిభావంతో బాలరామాయణం, నామరామాయణం ఆలాపనలతో శ్రీరామనామంతో ఆలయం పులకించింది. అనంతరం ప్రముఖ నాట్యగురువు గండవరం శ్రీనివాసులురెడ్డిచే అన్నమయ్య సంకీర్తనల ఆలాపన మధురంగా సాగింది.

విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం

తిరుపతిలోని సంగీత, నృత్యకళాశాలలో నాట్య విద్యను సాధన చేస్తున్న నెల్లూరుకు చెందిన ఏ శ్రీకృతికి విశ్రాంత ఉపాధ్యాయుడు, కవి,పండితులు ఆలూరు శిరోమణిశర్మ విద్యాప్రోత్సాహకంగా రూ.11వేలు అందజేశారు. తన అభ్యర్థన మేరకు ప్రవాసాంధ్రులైన భాగవతుల ప్రవీణ్, మాధవి దంపతులు రూ.10వేలు నగదు ప్రోత్సాహకం పంపారని ఆయన తెలిపారు. ఏ భవానీప్రసాద్ మరో రూ.1000 శ్రీకృతికి అందజేశారని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీకృతి ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

నిత్యావసర సరుకులు, పండ్ల పంపిణీ



నెల్లూరు (అర్బన్): విశ్వమాత సేవా ఫౌండేషన్ అధ్యక్షురాలు ధూబిశెట్టి కళ్యాణి ఆధ్వర్యంలో నవాబుపేటలోని ధర్మరాజు గుడి, చినబాలయ్యనగర్‌లోని పేదలకు సోమవారం పండ్లు, బిస్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నవాబుపేటకు చెందిన తబలా వాయిద్యకారుడు రవిబాబు పుట్టిన రోజు సందర్భంగా ఆయన సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. అలాగే నవాబుపేట ప్రాంతానికి చెందిన నిరుపేద కొట్టే నాగలక్ష్మికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు.హైదరాబాద్‌కు చెందిన జొన్న ఆదిశేషయ్య జ్ఞాపకార్థంగా ఆయన భార్య కనకమ్మ నిత్యావసర సరుకులు వితరణ చేశారు.

సమీపై చర్యలు తీసుకోవాలని వినతి



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అప్సర్

నెల్లూరు(క్రైమ్): సోషల్ మీడియా వేదికగా తనపై అసత్య ఆరోపణలు చేసిన సయ్యద్ సమీ హుస్సేనీపై చర్యలు తీసుకోవాలని నగర ఎమ్మెల్యే పీఏ షేక్ అప్సర్ పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ ఏ సురేంద్రబాబుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్సర్ మాట్లాడుతూ తాను నగరంలోని చామండివారితోటలో నివాసం ఉంటున్నానన్నారు. అగ్రికల్చరల్ మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నానని తెలిపారు. 2014 నుంచి డిప్యుటేషన్‌పై నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌కు పీఏగా విధులు నిర్వహిస్తున్నానని చెప్పారు. ఈ నెల 20న 'రౌడీలాగా లూటీ చేస్తున్నానని, అటెండర్ హోదా కలిగిన తన దగ్గర రూ.50కోట్లు ఎక్కడివని, దొంగనని''ఇలా తనపై నగరానికి చెందిన సయ్యద్ సమీ హుస్సేనీ ఫేస్‌బుక్ వేదికగా అసత్య పోస్టులు చేశారన్నారు. దీనిపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని అప్సర్ చిన్నబజారు ఇన్‌స్పెక్టర్‌ను కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): తనపై అలిగి భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్తాపంతో భర్త ఆత్మహత్యచేసుకున్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు..బోగోలు మండలం పాతబిట్రగుంటకు చెందిన పీ వెంకటకృష్ణ(45), కావ్య దంపతులు. వారికి 8 ఏళ్ల క్రితం వివాహమైంది. ఒక కుమార్తె ఉంది. కొంతకాలం క్రితం నెల్లూరు వచ్చారు. వైఎస్సార్‌నగర్‌లో ఉంటూ దంపతులు ఇద్దరూ బేల్దారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఏడాది క్రితం వెంకటకృష్ణ బంధువుల వద్ద అప్పు చేసి, భార్య నగలు కుదువపెట్టి వైఎస్సార్‌నగర్‌లో ఓ ఇంటిని కొన్నాడు. అప్పు తీర్చాల్సి ఉండగా అందుకు భిన్నంగా వెంకటకృష్ణ సంపాదించిన మొత్తంతో జల్సాలు చేయసాగాడు. ఈ విషయమై దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. దీంతో కావ్య జరిగిన విషయాన్ని తన అత్త, ఆడబిడ్డకు తెలియజేసింది. వారు సైతం వెంకటకృష్ణను మందలించారు. అయినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ నెల 20న ఆయన భార్యతో తీవ్రంగా గొడవపడ్డాడు. దీంతో కావ్య జరిగిన విషయాన్ని తన ఆడబిడ్డకు తెలియజేసింది. ఆమె మరుసటిరోజు వస్తానని చెప్పింది. భర్త వేధింపులు తాళలేక ఈ నెల 21న వేకువజామున కావ్య తన అన్న మహేష్‌కు ఫోన్‌చేసి తన కుమార్తెను తీసుకుని జగదేవిపేటలోని పుట్టింటికి వెళ్లింది. భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్తాపంతో ఆదివారం రాత్రి వెంకటకృష్ణ తన ఇంట్లోని సీలింగ్‌ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం మరదలు ద్వారా తెలుసుకున్న కావ్య హుటాహుటిన నెల్లూరుకు చేరుకుని కన్నీటి పర్యంతమైంది. ఈ మేరకు ఆమె వేదాయపాళెం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.